GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 86 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శుక్రవారం 29-11-2024 | పేజీలు : 3

## మంత్రి కొండా సురేఖపై కేసు నమోదు

**-కోర్టు ఆదేశాలు**



**టీ మీడియా,నవంబర్ 28,హైదరాబాద్:** మంత్రి కొండా సురేఖకు మరో దెబ్బ తగిలింది. సినీ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నాగార్జున వేసిన పిటిషన్ ను పిటిషన్ను నాంపల్లి కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలో.. వెంటనే కొండా సురేఖపై కేసు నమోదు చేయాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. కొండా సురేఖకు సమన్లు జారీ చేసిన కోర్టు.. వచ్చే నెల 12 తేదీన హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది.

## ఫుడ్‌పాయిజన్ ఘటనలపై
# సీఎం ఆగ్రహం

**-కలెక్టర్లకు కీలక ఆదేశాలు**



**టి మీడియా, నవంబరు 28,హైదరాబాద్ బ్యూరో :** గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు ఇటీవల వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. ఒకే హాస్టల్‌లో రెండు మూడు సార్లు ఫుడ్ పాయిజన్ జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాల్లలో విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలసత్వం పనికిరాదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. విద్యార్థులకు అందించే ఆహారానికి సంబంధించి జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్లు తరచూ పాఠశాలల, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఇందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా ప్రభుత్వ విద్యాసంస్థల్లో జరుగుతున్న పొరపాట్లపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాశీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠినచర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే, వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు వెనుకాడమని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించామని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. విద్యార్థుల విషయంలో తాము సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

వసతిగృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించడంతో పాటు లేని వార్తలను ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.



### పాలమూరులో..
## రైతుల పండగ

**-ప్రారంభించిన మంత్రి తుమ్మలనాగేశ్వరరావు**

**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రభుత్వం రైతు పండగ జరుపుతోంది. మహబూబ్ నగర్లో జిల్లా కేంద్రం భూత్పూర్ లో రైతుల పండగ సదస్సు అన్ని జిల్లాల నుంచి రైతులు హాజరయ్యేల ఏర్పాట్లు చేసారు. మూడు రోజుల రైతు పండగను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగకు తెలంగాణ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మినిస్టర్ దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ,మంత్రి జూపల్లి కృష్ణారావు, పాల్గొన్న తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పోరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి,రైతు కమిషన్ చైర్మన్, ఉమ్మడి ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు, ఆయిల్ఫెడ్ కార్పోరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపిలు పాల్గొన్నారు. శుక్రవారం ఇతర జిల్లాల రైతులు సదస్సుకు హాజరయ్యేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.రైతుల పండగలో భాగంగా ఎల్లుండి లక్ష మంది రైతులతో జరిగే సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు.

## పంచాయతీ ఎన్నికలపై సర్కార్ కసరత్తు..



### జనవరి 14న నోటిఫికేషన్..?

టీ మీడియా,నవంబర్ 28,హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు సర్కార్ కసరత్తు మొదలుపెట్టింది. 2025, జనవరి 14వ తేదీన నోటిఫికేషన్ వచ్చే ఛాన్స్ ఉన్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.మొత్తం 3 దఫాలుగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.పంచాయతీరాజ్ వ్యవస్థలో కూడా కొన్ని కీలక మార్పులు చేయాలని సర్కార్ నిర్ణయించింది. కనీసం ఐదుగురు ఎంపీటీసీలతో ఒక ఎంపీపీ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ప్రస్తుతం కొన్ని మండలాల్లో ముగ్గురు ఎంపీటీసీలతో ఒక ఎంపీపీ ఉంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంపీపీ బిల్లు తెచ్చే యోచనలో సర్కార్ ఉంది.2024, ఫిబ్రవరి నెలతోనే తెలంగాణలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ఇన్‌ఛార్జ్‌ల పాలన నడుస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరగబోతున్న తొలి సర్పంచ్ ఎన్నికలు ఇవే కావటం గమనార్హం. దీంతో ఈ ఎన్నికలు ఆసక్తిగా మారాయి. ప్రత్యేకాధికారుల పాలనపై ఇప్పటికే ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి.

## బోటు ఇంజన్ విఫలం

**-తొమ్మిది మందితో సముద్రంలోనె**
**-యుద్ధప్రాతిపదికన చర్యలు**





**టీ మీడియా, నవంబర్ 28,కృష్ణ పట్నం :** ఇంజన్ విఫలమై తిరుపతికి 35 కిలోమీటర్ల దూరంలో కృష్ణ పట్నం పోర్టుకు సమీపంలో నిలిచిపోయిన బోటును సురక్షితంగా వెనక్కు తీసుకురాగలిగామని రెవిన్యూ ( భూ పరిపాలన, విపత్తుల నిర్వహణ, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, సర్వే సెటిల్ మెంట్) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా తెలిపారు. ఈ ఉదయం నుండి యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలు సత్ ఫలితాలను ఇచ్చాయన్నారు. బోటులో చిక్కుకు పోయిన 9 మంది మత్స్య కారులను కాపాడి బోటును సురక్షితంగా ఒడ్డుకు చేర్చారని సిసోడియా వివరించారు.

బుధవారం ఉదయం బోటు సముద్రంలో నిలిచిపోయిన విషయం కోస్ట్ గార్డ్, కృష్ణపట్నం ఓడరేవు అధికారులకు చేరగా వెంటనే అప్రమత్తమైన విపత్తుల నిర్వహణ శాఖ తదనుగుణ చర్యలకు ఉపక్రమించింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా వెంటనే రంగంలోకి దిగి తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, కృష్ణపట్నం మెరైన్ హెడ్ కెప్టెన్ రజత్ తో మట్లాడారు. చిక్కుకుపోయిన మత్స్యకారులను రక్షించేందుకు, ఓడరేవు ప్రాంతం నుండి లోపలకు వెళ్లేందుకు డీజీ షిప్పింగ్ అనుమతి ఆవశ్యకతను జిల్లా కలెక్టర్, సిసోడియాకు వివరించారు. డిజి షిప్పింగ్ తో మాట్లాడిన సిసోడియా అవసరమైన అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నారు. తుఫాను కారణంగా వాతావరణం ఇబ్బంది కరంగా ఉన్నప్పటికీ ఎంతో శ్రమకోర్చిన అధికారులు, సిబ్బంది ఎట్టకేలకు విజయవంతంగా తాడును పడవతో అనుసంధానించి ఒడ్డుకు చేర్చగలిగారు. సచివాలయం నుండి విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, అటు జిల్లా కలెక్టర్ సంయుక్త కృషి ఫలితంగా 9 మంది ప్రాణాలను కాపాడగలిగతారు.



### సామాజిక సర్వేలో..
## సీఎం రేవంత్ కుటుంబం

**-వివరాలు నమోదు**

**టీ మీడియా,నవంబర్ 28,హైద్రాబాద్ బ్యూరో :** యావత్ దేశానికి మార్గాన్ని నిర్దేశిస్తూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వివరాలు నమోదు చేయించుకున్నారు.హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ , జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి , ఇతర అధికారులు, ఎన్యుమరేటర్లు, సిబ్బందితో కూడిన సర్వే బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు.సర్వే పురోగతి వివరాలను, సర్వేలో పాల్గొన్న ప్రజల స్పందన గురించి అధికారులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి గ, వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేలా కార్యాచరణ ఉండాలని సూచించారు.ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా సర్వేలో వివరాలు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు.

## ఆర్మీ కీలక నిర్ణయం..

**- కార్గిల్ సహా 48 యుద్ధక్షేత్రాల పర్యటనకు గ్రీన్ సిగ్నల్?**



**టి మీడియా, నవంబరు 28, ఢిల్లీ :** భారత సైన్యం కీలక నిర్ణయం తీసుకుంది. హిమాలయాల్లోని యుద్ధ క్షేత్రాల సందర్శనకు సంబంధించి ఆర్మీ సంచలన నిర్ణయం ప్రకటించింది. కార్గిల్, సియాచిన్ గ్లేసియర్, గల్వాన్‌లలో పర్యాటకులను అనుమతించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్మీ చీఫ్ జనరల్ .. ఉపేంద్ర ద్వివేది వివరాలు వెల్లడించారు. పుణె యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ వృద్ధి పయనంలో ఇండియన్ ఆర్మీ పాత్ర అంశంపై ప్రసంగించారు.సరిహద్దు ప్రాంతాల్లో పర్యటకుల కోసం సాహస కార్యకలాపాలను ఆర్మీ ప్రోత్సహిస్తుందని.. ఇందుకోసం టూర్ ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తుందని తెలిపారు. కార్గిల్ , గల్వాన్ వంటి యుద్ధక్షేత్రాలను చూసేందుకు పర్యటకులకు అనుమతిస్తామన్నారు. జమ్మూకశ్మీర్ లో పర్యాటకాభివృద్ధికి అపార అవకాశాలున్నాయని ద్వివేది పేర్కొన్నారు.గత కొంతకాలంగా సరిహద్దు ప్రాంతాల్లో సందర్శకుల పెరుగుదల భారీగా కనిపిస్తోందన్నారు. ఈ క్రమంలోనే పర్యటకాన్ని ప్రోత్సహించేందుకు 48ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో పర్యటకుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉందని జనరల్ ద్వివేది వెల్లడించారు.

## గజగజ వణుకు

**- భారీగా పడిపోతున్న టెంపరేచర్లు**
**- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్**
**- కొద్ది రోజులు ఇదే పరిస్థితి ఉండే చాన్స్**

**టి మీడియా,నవంబర్ 28,హైదరాబాద్బ్యూరో :** చలితో రాష్ట్రం గజగజలాడుతున్నది. రాత్రి టెంపరేచర్లు విపరీతంగా పడిపోతుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ 15 డిగ్రీల కన్నా తక్కువ టెంపరేచర్లే రికార్డు అవుతున్నాయి. ఏజెన్సీ ఏరియాలతోపాటు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా నమోదవుతున్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డిల్లో 10 డిగ్రీల కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్లో అత్యల్పంగా 7.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా అర్లిటిలో 9.2, కామారెడ్డి జిల్లా డోంగ్లిలో 9.5, సంగారెడ్డి జిల్లా న్యాల్కల్లో 9.7 డిగ్రీల చొప్పున కనిష్ట టెంపరేచర్లు రికార్డయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా, వికారాబాద్ జిల్లాల్లో 10.1, నిజామాబాద్, మెదక్లో 10.2, నిర్మల్ జిల్లాలో 10.3, రంగారెడ్డి జిల్లాలో 10.6, జగిత్యాలలో 10.7 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మొత్తంగా 29 జిల్లాల్లో 14 డిగ్రీల కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. మిగతా జిల్లాల్లో 15 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంలోనూ అత్యల్ప ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. శేరిలింగంపల్లిలో అత్యల్పంగా 11.6 డిగ్రీల కనిష్ట టెంపరేచర్ నమోదైంది.దీంతో పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

### దక్షిణాదిన 4 జిల్లాల్లో తక్కువ చలితీవ్రతలి

రాష్ట్రంలోని 4 దక్షిణాది జిల్లాల్లో టెంపరేచర్లు కాస్తంత ఎక్కువగానే రికార్డవుతున్నాయి. సూర్యాపేట, ఖమ్మం, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కన్నా ఎక్కువగా నమోదవుతున్నాయి. మిగతా అన్ని జిల్లాల్లోనూ 14 డిగ్రీలలోపు రికార్డవుతున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ కంటిన్యూ అవుతుండగా.. మరో 25 జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతున్నది.ఉత్తర భారతం నుంచి వీస్తున్న గాలులతో రాష్ట్రంలో టెంపరేచర్లు భారీగా పడిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. మరికొద్ది రోజులపాటు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని అంటున్నారు.



### జిల్లా టెంపరేచర్

సిర్పూర్ (ఆసిఫాబాద్) 7.9 డిగ్రీలుఅర్లి టి (ఆదిలాబాద్) 9.2 డిగ్రీలుడోంగ్లి (కామారెడ్డి) 9.5 డిగ్రీలున్యాల్కల్ (సంగారెడ్డి) 9.7 డిగ్రీలునమోదు అయింది.

# గురుకుల ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

## -బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** మదనాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని,ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గురువారం మదనాపూర్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ ప్రిన్సిపల్ మరియు విద్యార్థులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వనపర్తి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గారిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ మధ్యనే డైట్ కాస్మొటిక్ ఛార్జీలు 40% పెంచిందన్నారు.ఓ వైపు ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుంటే.కొంత మంది అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం చేయడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. గతంలో కూడా రెండు సార్లు ఇలాంటి ఘటనలే జరిగాయని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ని కోరారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విద్యార్థులకు మానసిక వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు వారంలో ఒకరోజు గురుకుల,సంక్షేమ వసతి గృహాలను సందర్శించి అక్కడే నిద్రించే కార్యక్రమం చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు వజగౌని వెంకటన్న గౌడ్, మహేందర్ నాయుడు,అంజన్న యాదవ్, గంధం నాగరాజు, శివ నాయక్, రాఘవేందర్ గౌడ్, గాలిగల్ల సాయిబాబ, శివశంకర్, గౌతమ్ శంకర్,శ్రీనివాస్ గౌడ్,నగేష్ పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

**టీ మీడియా, నవంబర్ 27, చిన్న చింతకుంట :**



దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండల కేంద్రానికి చెందిన తెలుగు బుజమ్మ అపరేషన్ కోసం హైద్రాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రికి సీఎం సహాయ నిధి ద్వారా 2 లక్షల, 50000 వేల రూపాయల ఎల్ వో సి ని, బండారి బాబు కు ఒక లక్ష రూపాయలు ఎల్ఓసి కుటుంబ సభ్యులకు అందజేసిన దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూధన్ రెడ్డి

# విద్యార్థి మృతి పై సమగ్ర విచారణ జరిపించి ఆదుకోవాలి

## విద్యార్థి సంఘాల నేతల డిమాండ్



**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా మదనపూర్ గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ప్రవీణ్ అనే విద్యార్థి మృతిపై గురువారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని విద్యార్థి సంఘాల నేతలు కలసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ పాఠశాలలో బుధవారం ఉదయం 9:30 గంటల సమయంలో అనుమానాస్పదంగా విద్యార్థి చనిపోయాడు. కానీ పాఠశాల సిబ్బంది విద్యార్థి ఉరేసుకొని చనిపోయాడని నిర్ధారించారు.కానీ విద్యార్థి మృతి పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థి మృతి పై తమరి ఆధీనంలో సమగ్రమైన విచారణ జరిపించి మృతికి కారకులైన అధికారులను తక్షణమే విధుల నుండి తొలగించాలని,విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం తరఫున 20 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు.వనపర్తి జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో,గురుకులాలు, హాస్టల్స్ లో తీవ్రమైన సమస్యలతో కొనసాగుతున్నాయి. వీటికి కారణం పై అధికారులు సకాలంలో పర్యవేక్షణ చేయక పోవడం ఒకవేళ చేసిన నామమాత్రంగా చేసి రావడం జరుగుతుంది. కావున అధికారులు తప్పనిసరిగా వారానికి ఒకసారి బస చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.ఆది, పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. పవన్ కుమార్,జీవీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ నాయక్, పి డి ఎస్ యు నాయకులు గణేష్,ఎమ్మెస్ఎఫ్ నాయకులు పరుశురాం, బిజివిఎస్ నాయకులు శివ నాయక్, బిఎస్ఎఫ్ నాయకులు రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మొగిలి, కుమార్, నీలోత్పల్, పి డి ఎస్ యు నాయకులు గోపి తదితరులు పాల్గొన్నారు.

# అణగారిణ కులాల అభ్యున్నతికి పాటుబడ్డ మహనీయుడు

## - మహాత్మ జ్యోతిబాపూలే - ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది మహాత్మా జ్యోతిబా పూలేని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.పూలే వర్ధంతి సందర్భంగా వనపర్తి క్యాంపు కార్యాలయంలో ఆయాన పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తైలం శంకర్ ప్రసాద్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మహేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత, మాజీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, వికలాంగుల జిల్లా అధ్యక్షులు గంజాయి రమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొంకి వెంకటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, వనపర్తి మున్సిపాలిటీ కౌన్సిలర్లు, జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా సమన్వయకర్త నందిమల్ల చంద్రమౌళి, జెడ్పిటిసిలు మార్చే ఎంపీపిలు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, మైనార్టీ నాయకులు, ఆయా మండలాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

## -ఏబీవీపీ వనపర్తి నగర కార్యదర్శి జ్ఞానేశ్వర్



**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** ఏబీవీపీ వనపర్తి ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆత్మహత్యలను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఏ విధంగా ఆడుకుందో ఈ ప్రభుత్వం కూడా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంది కనీస వసతులు లేక విద్యార్థులు అష్ట కష్టాలు పడు తున్నారు మధ్యాహ్న భోజనం వల్ల ఫుడ్ పాయిజన్ తో ఎంతోమంది విద్యార్థులు అస్వస్థకు గురయ్యారు ఒకే సంవత్సరంలో 886 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ గురయ్యారు వారు మృత్యుని జయించి బతికారు ఒక సంఘటన జరిగి మరవకముందే ఇంకో సంఘటన జరుగుతుంది మద్యానికి మంత్రి ఉండగానే విద్యకు మంత్రి లేడు ఈ ప్రభుత్వం విద్యార్థుల కోసం అసలు పట్టించుకోవడం లేదు మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేని భోజనం వడ్డిస్తున్నారు ఎక్కడైనా ఏమైనా సంఘటన అధికారులు అస్సలు స్పందించడం లేదు అంటే ప్రాణాలు కోల్పోతేనే వీరు స్పందిస్తారా ఇప్పటికే 51 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు అయినా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి అసలు కనీస సోయ లేకుండా ఎక్కడ పడ్డా గొంగడి అక్కడే ఉన్నట్లు వారి వ్యవహార శైలి కనిపిస్తుంది సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడైనా స్పందించి హాస్టల్ విద్యార్థుల జీవితాలను బాగు చేయాలని కోరు తున్నాము. ఈ కార్యక్రమంలో బంటి, పవన్ విష్ణు,ఆదిత్య, భరత్, సంతోష్, వంశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండంలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేయాలి

## కేంద్ర సమంత్రి ని కల్సిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**టీ మీడియా,నవంబర్ 28,గోదావరిఖని :**



రామగుండం ప్రాంతం లో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు ద్వారా ఈ పారిశ్రామిక ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.రామగుండం ఏరియాలో కొత్తగా ఇండస్ట్రీస్ రావడానికి అవకాశం ఉంది తద్వారా ఈ ప్రాంత యువతకు ఉద్యోగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.ఇప్పటికే రామగుండం లో ఎన్టీపీసీ,బసంత్ నగర్, కేశోరం సిమెంట్ ఫ్యాక్టరీ,ఆర్ ఎఫ్ సి ఎల్, గోదావరిఖనిలో సింగరేణి కోల్ మైన్స్ తో పాటు అనేక సహజ,మానవ వనరులు అందుబాటులో ఉన్నాయి.ఎయిర్ పోర్ట్ ఏర్పాటు తో వీటికి సంబంధించిన కొత్త పరిశ్రమలు ఏర్పాటుకు విస్తారమైన అవకాశాలు ఉన్నాయి.రామగుండంలో ఉత్తర దక్షిణ రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది ప్రజలు స్థిరపడ్డారు.వ్యాపారం వాణిజ్యం ఉన్నత చదువుల కోసం మెరుగైన రవాణా వ్యవస్థనుకోరుకుంటున్నారు.అని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

# చిన్ననాటి మిత్రుని కుటుంబానికి చేయూత

**టీ మీడియా,నవంబర్ 28,గోదావరిఖని :**



గుండెపోటుతో మృతి చెందిన గోదావరిఖని కి చెందిన దేవసాని రాజ పాపయ్య కు ఆయన చిన్ననాటి స్నేహితులు జనగామ తిరుపతి,అతని మిత్రబృందం అందరు కలిసి తలా కొంత అనుకుని దాదాపుగా నలభై వేల రూపాయలు జమచేసి వారి కూతురు పేరు మీద ఫిక్స్ చేసి ఇస్తాము అని భరోస ఇచ్చారు.గోదావరిఖని లో గురువారం జరిగిన పెద్దకర్మ సందర్భంగా ముందుగా రాజ పాపయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఎవరైనా మిత్రుని కుటుంబం ఆపదలో ఉన్నది అని తెలిస్తే మేమున్నాం అంటూ ఆదుకోవడానికి ముందుకు వస్తాం అని జనగామ తిరుపతి మిత్ర బృందం సభ్యులు ప్రకటించారు. తోచినంత సేకరించి ఆపదలో ఉన్న ఉన్న మిత్రులకే కాకుండ పేద కుటుంబాలకు అండగా నిలుస్తాం అని పెర్కొన్నారు. తోటి మిత్రుడు దేవాసాని రాజ పాపయ్య గుండెపోటుతో మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాల్యమిత్రుని భార్యకు, కూతురు కి మానసికంగా పాప భవిష్యత్తు గురుంచి ఆందోళన చెందుతున్న విషయాన్ని గమనించిన మిత్రులు స్పందించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు జనగామ తిరుపతి,కట్ట కుమారస్వామి,తమ్మిశెట్టి సంపత్,రామ్ శంకర్, దాసరి ఓదెలు,వెన్నెం శ్రీనివాస్,తాండ్ర సదానందం,తూడి సురేష్, పసుల అశోక్,శ్యామ్ సుందర్,తదితరులు పాల్గొన్నారు.

# నూతన డీఈఓ ను సన్మానించిన కళా వేదిక సభ్యులు



**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా విద్యా శాఖాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ అబ్దుల్ ఘనిని సాహితీ కళా వేదిక సభ్యులు గురువారం ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా కళావేదిక పక్షాన తాము నిర్వహిస్తున్న అనేక సాహిత్య సాంస్కృతిక విద్యా సంబంధిత కార్యక్రమాల గూర్చి వివరించారు. నూతనగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.అవసరమైనపుడు కళా వేదిక సభ్యుల సహకారాన్ని అందుకుంటామని డిఇఓ తెలియ జేశారు. ఈనాటి కార్యక్రమంలో డిసిఇబి సెక్రటరీ సూర చంద్ర శేఖర్,అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాస రావు, ఎంఈఓ మద్దిలేటి, వ్యాఖ్యాత బైరోజు చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# రైతుల కలల పండుగ కార్యక్రమంలో

## ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం డాక్టర్ రాజానర్సింహా ముఖ్య అతిధిగా హాజరైన మహబూబ్ నాగర్ జిల్లా,అమిస్తాపురం మండల కేంద్రంలోని మూడు రోజుల పాటు నిర్వహించే రైతుల కలల పండుగ ప్రారంభోత్సవ కార్యాక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయం శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు,ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు,ఆయా నియోజకవర్గం ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి



**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** వంగూరు మండలం పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో జ్యోతిరావు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరి ఫౌండేషన్ సభ్యులు కంకణాల నర్సిరెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సామాజిక ఉద్యమ కారుడు అదే విధంగా ప్రతి ఒక్కరికి చదువు రావాలని చదువు కోసం ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థులు



**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** ఈనెల 6 వ తేదీన గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి అండర్ 14 బాలురు, బాలికల సెలక్షన్లలో పాల్గొని పెద్దమందడి ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఆర్ .రేవతి, ఆర్ అంజలి 9వ తరగతి చదువుతున్న శివ శంకర్ ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న , ఫిజికల్ డైరెక్టర్ మన్యం యాదవ్ తెలిపారు. వీరు నవంబర్ 29, 30, డిసెంబర్ 1 వ తేదీ వరకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు .

# తహసిల్దార్ కార్యాలయనిర్మాణం కి -50 లక్షల మంజూరు



**టీ మీడియా, నవంబర్ 28 , పెద్దపల్లి బ్యూరో:** పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండల తహసిల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలమై వర్షాకాలంలో వర్షపు నీరు కార్యాలయంలోనికి చేరి వారి యొక్క విధులకు ఎన్నో సంవత్సరాల నుండి ఆటంకం కలిగిస్తున్నప్పటికీ గత ప్రభుత్వంలో పలుమార్లు విన్నవించిన వినక పోవడంతో తాజాగా ఏర్పడినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్థానిక కాంగ్రెస్ మండల నాయకులు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ ప్రస్తుత ఎమ్మెల్యే విజయ రమణరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తక్షణమే స్పందించి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను పంపించి పరిలించిన తరువాత 50 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసే నూతన తాసిల్దార్ కార్యాలయ భవనానికి నిధులు మంజూరు చేయడం జరిగింది. నిధులు మంజూరు చేయడానికి కృషి చేసినటువంటి ఎమ్మెల్యే విజయ రమణ రావు కు మండల కాంగ్రెస్ నాయకులతో పాటు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలపడం జరిగింది.

# ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

## ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ సభ్యులు



**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా మదనపురం బాలుర గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కొన్నూరు గ్రామానికి చెందిన ప్రవీణ్ ( 14 ) అనే విద్యార్థి బుధవారం రోజున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం గురించి తెలుసుకోవడానికి ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ సభ్యులు గురుకుల పాఠశాలను గురువారం సందర్శించడం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలను ప్రిన్సిపాల్ ని అడగడానికి వెళితే అక్కడ అతను అందుబాటులో లేడు ఫోన్ ద్వారా సంప్రదిస్తే అందుబాటులోకి రాలేదు. తోటి విద్యార్థులను ఆ యొక్క విషయాల గురించి అడగగా, ఆత్మహత్యకు గల కారణాల గురించి తెలుసుకొని, సంఘటన జరిగిన గదిని పరిశీలించడానికి వెళ్తే గదికి తాళం వేసి ఉంది. ఆత్మహత్య గల కారణాలను పూర్తిస్థాయిలో విచారణ చేసి విద్యార్థి యొక్క కుటుంబానికి న్యాయం చేయాలని అలాగే ప్రభుత్వం ఈ కుటుంబానికి ఆర్థికంగా సాయం చేసి ఆదుకోవాలని ఇలాంటి ఘటనలు మళ్లీ భవిష్యత్తులో పునరావృతం కాకుండా గురుకుల వ్యవస్థను ప్రభుత్వం పటిష్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరడమైనది .ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ జిటి. శ్యామ్ , వనపర్తి జిల్లా ప్రెసిడెంట్ సి .విశ్వం బాబు, జిల్లా జనరల్ సెక్రెటరీ గద్వాల.ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు గొర్ల శైలాన్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వాస్పత్రిలో శవాలు మాయం

## -వెలుగులోకి షాకింగ్ విషయాలు




**టి మీడియా, నవంబరు 28,ఏలూరు:** ప్రభుత్వాస్పత్రిలోని అనాథ శవాల మాయం వ్యవహారంలో ఉచ్చు బిగుస్తోంది. మెడికల్ బోర్డు అధికారుల బృందం విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి రావడం షాకిస్తోంది.ఏలూరు ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో మృతదేహాల మాయం కేసు ప్రకంపనలు రేపుతోంది. దీనికి సంబంధించి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ టీమ్ విచారణ వేగవంతం చేసింది. డీఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారితోపాటు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. మార్చురీలోని మృతదేహాల మాయం వ్యవహారంపై డీఎంఈ సీనియర్ వైద్యాధికారి వెంకటేశ్ తన బృందంతో ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాలలో విచారణ చేశారు.ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో అనాథ శవాలను వేర్వేరు ప్రాంతాలకు విక్రయించిన వ్యవహారంపై ఫోకస్ పెట్టారు. మార్చురీలోని రికార్డులతోపాటు సీసీ ఫుటేజ్‌ను ఆరా తీశారు. ఈ క్రమంలోనే.. రిజిస్టర్‌లో కొన్ని పేజీలను ఇటీవల చించివేసినట్లు ఆరోపణలు రావడంతో దానిపైనా విచారించారు. ప్రధానంగా.. మార్చురీ ఇన్‌ఛార్జ్, ఆ విభాగంతో సంబంధాలున్న ఇతర అధికారులు, పనిచేసే సిబ్బందినీ వేర్వేరుగా ఎంక్వైరీ చేశారు.ఆస్పత్రిని మెడికల్ కాలేజ్‌కు అనుసంధానం చేసిన తర్వాత మార్చురీలో ఎన్ని అనాథ శవాలున్నాయి? ఎన్నింటిని ఖననం చేశారు? లెక్కల్లోకి రానివి ఎన్ని?.. అనే అంశాలపై విచారణ చేసి కీలక విషయాలు రాబట్టారు. ఇప్పటికే.. అక్టోబర్ 8న రాత్రి మార్చురీలోని అసిస్టెంట్ అశోక్ ఒక అనాథ మృతదేహాన్ని అంబులెన్స్‌లో బయటకు తీసుకువెళ్లినట్లు తేలింది. శవం మాయంపై డ్యూటీలోని మరో మార్చురీ అసిస్టెంట్ గుర్తించి సంబంధిత హెచ్‌వోడీకి ఫిర్యాదు చేయడంతో గుట్టురట్టు అయింది. దాంతో.. బయటకు వెళ్లిన మృతదేహాన్ని వెనక్కి రప్పించి మార్చురీలో పెట్టారు.అయితే.. మార్చురీలో శవాల మాయానికి సంబంధించి అసిస్టెంట్ అశోక్‌పై ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో అతన్ని విధుల నుంచి తొలగించారు. తాజాగా.. శవాల మాయం వ్యవహారంలో మరికొందరి పాత్ర ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఆ కోణంలోనూ విచారిస్తున్నారు మెడికల్ అధికారులు.

# అంగరంగ వైభముగా స్వామి వారి నిత్య కల్యాణం



**టీ మీడియా,నవంబర్ 28,సింహాచలం :**
దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండ పంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

# ఎస్ఎస్సి యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి

**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో:** ఎస్ఎస్సి యాక్షన్ ప్లాన్ జనవరి 1నుంచి అమలు చేయాలి కోరుతూ కలెక్టరు ఆదర్శ్ సురభిని గురువారం సాయంత్రం ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలవడం జరిగింది. ఎస్ఎస్ సి పార్టు-2 పుస్తకాలు ఇటీవల కాలంలోనే పంపించేశారని, దీని ఫలితంగా సకాలంలో సిలబస్ పూర్తికాలేదని వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వత్తిడికి గురవుతారని తెలపగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ . రవి ప్రసాద్ గౌడ్,డి కృష్ణయ్య , పి ఆర్ టి యు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బౌద్ధారెడ్డి,సూర చంద్రశేఖర్, టీపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అమరేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ ,టి టి యు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనిల్ కుమార్, ప్రతాప్ రెడ్డి ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# దీక్షా ధివాస్ కోసం ముమ్మర ఏర్పాట్లు

**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కె.టి.ఆర్ పిలుపు మేరకు జిల్లా పార్టీ కార్యాలయం (నాగవరం)దగ్గర ప్రతిష్ఠాత్మకంగా దీక్షాదివాస్ కార్యక్రమం నిర్వహించుటకు ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో స్టేజ్ అలంకరణ,అమర వీరుల స్థూపం, తెలుగుతల్లి విగ్రహం, కె.సి.ఆర్ కాటౌట్ , ఆనాటి ఉద్యమ స్మృతులు గుర్తు చేసేవిధంగా ఫోటో ప్రదర్శన తదితర ఏర్పాట్లను పట్టణ పార్టీ అధ్యక్షులు పలుస. రమేష్ గౌడ్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,మైనారిటీ నాయకులు ముద్దుసర్ ఆలీం, శివ,లక్ష్మణ్ తదితరులు పరిశీలించారు.ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ శుక్రవారం జరగబోయే దీక్షా ధివాస్ కార్యక్రమాన్ని బి.ఆర్.ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# వరి వేస్తే ఉరి కాదు.. సిరి



**-క్వింటాకు రూ.500 బోనస్‌తో రైతుల్లో సంతోషం**
**-వ్యవసాయమంటే దండగ కాదు..**
**-మంత్రులు దామోదర రాజ నర్సింహ, ద తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు**


**టీ మీడియా,నవంబర్ 28,మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ కు మూడు కిలోమీటర్ల దూరంలో అమిస్తాపూర్ శివారులో రైతు పండుగ సంబురాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే సంబురాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లు నేడు లాంచనంగా ప్రారంభించారు.. ఈ కార్యక్రమాంలో ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనున్నారు. రైతు విజయోత్సవ సభకు ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి రైతులు వచ్చారు.

స్టాల్స్ ప్రారంభించిన మంత్రులు

పాలమూరులో రైతువిజయోత్సవాలు సందర్భంగా అమిస్తాపూర్ వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రులు తుమ్మల, దామోదర, జూపల్లి ప్రారంభించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు 150 స్టాల్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రతి స్టాల్ దగ్గరకు వెళ్లి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి, మహబూబ్‌నగర్ ఇంచార్జ్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రైతుల పండుగను జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఆధునిక సాగు పద్ధతులను నేర్చుకోవడానికి రైతులు చూపిస్తున్న ఆసక్తి చూస్తుంటే చాలా సంతోషం కలుగుతోంది. వ్యవసాయం దండగ కాదు, పండుగ అని చెప్పాం. ప్రభుత్వం వచ్చిన మొదటి రోజు నుంచే ఆ మాటను ఆచరణలోకి తీసుకొచ్చాం. 11 నెలల కాలంలోనే 54,280 కోట్ల రూపాయలు రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేశాం.. ఏకకాలంలో 22.5 లక్షల మంది రైతులకు 18 వేల కోట్ల రుపాయల రుణమాఫీ చేశాం. ఈ వానకాలం సీజన్‌లో సుమారు 67 లక్షల ఎకరాల్లో, 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తెలంగాణ రైతాంగం పండించింది. పండిన ప్రతి గింజనూ కొనే బాధ్యత మా ప్రభుత్వానిది. రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణకు 8 వేల కేంద్రాలను ప్రారంభించాం. ఇప్పటికే నాలుగున్నర లక్షల మంది రైతుల నుంచి సుమారు 26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. రైతుల ఖాతాల్లో 5 వేల కోట్ల రూపాయలు జమ చేశాం. వరి వేస్తే ఉరి అని గత ప్రభుత్వం రైతులను బెదిరించింది. వరి వేస్తే ఉరి కాదు.. సిరి అని మా ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. మా ప్రభుత్వం సన్న వడ్లు పండించిన రైతులకు, క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తోంది. వరి మాత్రమే కాదు, కందులు, శనగలు, జొన్నలు, సోయాబీన్ వంటి పంటలకు మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఇప్పుడు వ్యవసాయమంతా యంత్రాల మీదే నడుస్తోంది. నాటు వేయడం దగ్గర్నుంచి కోత కోసే వరకూ ప్రతి పనికీ యంత్రాలు వచ్చాయి. ఇప్పుడిప్పుడే వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరుగుతోంది. భవిష్యత్తులో యాంత్రీకరణ ఇంకా పెరుగుతుంది. ఈ యంత్రాలు రైతులకు శారీరక శ్రమను తగ్గించడంతో పాటు, పెట్టుబడిని కూడా తగ్గిస్తున్నాయి. సాగుకు సాంకేతికతను జోడించి రైతుల ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. అని వెల్లడించారు.

## దీక్ష దివాస్ ని విజయవంతం చేయండి

**వాకిటి శ్రీధర్ జిల్లా బారస అధికార ప్రతినిధి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్**



**టీ మీడియా, నవంబర్ 28, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం జిల్లా పార్టీ ఆఫీస్ నందు శుక్రవారం ఉదయం 10:00 గంటలకు దీక్ష దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, సింగిరెడ్డి నిరంజన్రెడ్డి ఆధ్వర్యం లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ అభిమానులు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ శ్రేణులు,భారీగా తరలివచ్చి ఆనాటి 2009 నవంబర్ 29 న తెలంగాణ రాష్ట్రం సాధించడానికి కేసీఆర్ చేసిన ఉద్యమాన్ని , దీక్షలను గుర్తుచేస్తూ , ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ అమరవీరులను స్మరిస్తూ అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించి, తెలంగాణ తల్లికి పూలమాలతో, ఆనాటి ఉద్యమ స్ఫూర్తులను గుర్తు చేసుకొని, వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వనపర్తి పట్టణం లోని అన్ని వార్డుల వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు , అందరు పాల్గొనాలి.వాకిటి శ్రీధర్ బారస జిల్లా అధికార ప్రతినిధి మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ కోరారు.



## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్

**-ప్రారంభించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

**టీ మీడియా,నవంబర్ 28, మక్తల్ :**
మక్తల్ నియోజకవర్గం ఊట్కూరు మండల కేంద్రంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇందిరా మహిళా శక్తి ఒక అద్భుతమైన పథకమని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించడం. రాబోవు రోజులలో సముచిత స్థానం కల్పించే దిశగా తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది



## విద్యార్థులకు డబ్బులు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

**టీ మీడియా,నవంబర్ 28,అమరావతి బ్యూరో :**
ఏపీలో చంద్రబాబు సారథ్యంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తల్లికి వందనం పేరుతో ఇస్తున్న ఫీజు రీఎంబర్స్ మెంట్ ను నేరుగా కళాశాలల యాజమాన్యం ఖాతాల్లో వేయనున్నారు.

ఇకనుంచి విద్యార్థులను కళాశాలలు వేధిస్తే కఠిన చర్యలుంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. అలాగే పాఠశాల విద్యార్థులకు సంబంధించి తాజాగా మరో నిర్ణయం తీసుకున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లలో కీలక మార్పులు చేయబోతున్నారు.

**ఎటువంటి పార్టీ రంగులు లేకుండా..**

యూనిఫామ్ తోపాటు వారికిచ్చే బ్యాగులు, బెల్టుల రంగు మారుస్తున్నారు. గత ప్రభుత్వం వీటిపై మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరు ఉండేది. ఇప్పుడు మాత్రం వాటిపై ఎవరి పేర్లు లేకుండా విద్యార్థులకు అందివ్వబోతున్నారు. దీనివల్ల వారిపై రాజకీయంగా ఎటువంటి ప్రభావం ఉండదని, చదువుపై దృష్టిపెడతారని, ఇంట్లో కూడా రాజకీయ చర్చలు జరగవని ప్రభుత్వం భావిస్తోంది. చివరికి విద్యార్థులకిచ్చే బెల్టులపై కూడా వైసీపీ రంగు వేశారు. నోటు పుస్తకాలపై జగన్ బొమ్మను ముద్రించారు. ఇప్పుడు అటువంటివేమీ లేకుండా ఇస్తున్నారు. బ్యాగులు కూడా ఎంతో నాణ్యంగా ఉండేలా చూస్తున్నారు. నాణ్యతలో తేడా వస్తే కాంట్రాక్టర్ దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

**యూనిఫాం కుట్టించుకోవడానికి.**

యూనిఫాం కుట్టించుకోవడానికి ఎనిమిదో తరగతి విద్యార్థులకు రూ.120, 9, 10 చదివే విద్యార్థులకు 240 ప్రభుత్వం చెల్లించబోతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకివ్వబోతున్న కిట్లలో మూడు జతల యూనిఫామ్స్, షఉస్, బ్యాగ్, డిక్షనరీ, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, పాఠ్య పుస్తకాలు ఉంటాయి. ఒక్కో కిట్ కు రూ.1859 అవుతుందని అంచనా వేశారు. డిసెంబరులో టెండర్లు పిలవబోతున్నారు. దీనికితోడు మధ్యాహ్న భోజన పథకం ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. డిసెంబరు నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. ప్రాథమిక పాఠశాలలో ఒక్కో విద్యార్థికి ఇకనుంచి రూ.6.19, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదివేవారికి రూ.9.29 ఇవ్వనున్నారు. వీటిల్లో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరిస్తాయి.

## సెకి ఒప్పందంలో అవినీతి ప్రశ్నే లేదు

**-మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్.**



**టీ మీడియా,నవంబర్ 28,అమరావతి :** ఒప్పందం జరిగింది కేంద్ర ప్రభుత్వం(సెకి), రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమేనని.. ఏపీ చరిత్రలోనే నిలిచిపోయే అత్యంత చవకైన ఈ ఒప్పందంపై బురద జల్లుతూ రాతలు రాయడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్. తాడేపల్లిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రైతులకు ఉచిత కరెంట్ అనేది ఒక కల. దీనివల్ల రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. బాబు హయాంలో డిస్కంల పరిస్థితి దయనీయంగా మారింది. డిస్కంలను నిర్వీర్యం చేశారాయన. చంద్రబాబు చేసిన సోలార్ పవర్ ఒప్పందాలు రూ.5.90తో చేసుకున్నారు. డిస్కంల అప్పులను 86 వేల కోట్లకు పెంచారు. మా హయాంలో డిస్కంలను నిలబెట్టే ప్రయత్నం చేశాం. పగటి పూటే రైతులకు 9 గంటల కరెంట్ ఇవ్వగలిగాం. ఉచిత కరెంట్ కోసం రూ.9 వేల కోట్లు ఖర్చు చేశాం.ఆ టైంలో యూనిట్‌ను 2.40 నుంచి 2.50 రూ. చొప్పున సప్లై సేందుకు 24 బిడ్లు వచ్చాయి. కానీ, చంద్రగ్రహణం ఆ ప్రక్రియకు అడ్డం పడింది. కోర్టుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనికోసం మేం వివిధ కోర్టుల్లో పోరాడాల్సి వచ్చింది. అలాంటి టైంలో.. 2021 సెప్టెంబర్ 15వ తేదీన కేంద్ర ప్రభుత్వం (సెకి) నుంచి తియ్యటి కబురుతో ఓ లేఖ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను పొగుడుతూ.. రైతుల పట్ల ప్రదర్శిస్తున్న ప్రత్యేక శ్రద్ధను సెకీ అభినందించింది. యూనిట్‌కు రూ.2.49కే.. మొత్తంగా 9 వేల మెగా వాట్ల పవర్‌ను అందుబాటులోకి ఇస్తాం అంటూ పేర్కొంది. ఇందులో 2024 సెప్టెంబర్‌లో 3 వేల మెగా వాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుందని చెప్పింది. ఇది ఏపీ చరిత్రలోనే అతితక్కువ ధరకు అందించిన పవర్ ఆఫర్ ఇదికేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రశంసిస్తూ.. ఆ సంకల్పానికి తోడుగా ఉంటామని లేఖ రాసింది. మేమే పవర్ సప్లై చేస్తామని చెప్పింది. ఇక్కడ మూడో పార్టీ ఎక్కడుంది?. రెండోది.. రూ.2.49కి అందుబాటులోకి ఇస్తాం అంటూ పేర్కొంది. ఇది ఏపీ చరిత్రలోనే అతితక్కువ ధరకు అందించే ఒప్పందం. ఐఎస్‌టీఎస్ (ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ ఛార్జీలు) ఛార్జీలు లేకుండా(యూనిట్‌కు రూ.1.98పైసా చొప్పున).. స్పెషల్ ఇంటెన్సివ్ ఇస్తానంది. ఇక్కడ.. యూనిట్ రూ.2.61 మనకు కలిసి వస్తుంది. ఏడాది 4,400 కోట్లు కలిసి వస్తాయి. ఒప్పందం ప్రకారం పాతికేళ్లకు.. లక్షల కోట్లు కలిసి వచ్చేవి.ఏపీ చరిత్రలోనే అత్యంత చవకైన విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఇది. లక్షల కోట్లు ఆదాయం ఆదా కావడం సంపద సృష్టి కాదా?. ఇది చరిత్రలో నిలిచిపోయే ఒప్పందం. ఇలాంటి ఒప్పందానికి స్పందించకున్నా.. చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా ఊరుకునేవా?. నన్ను ఏమనేవారు.చంద్రబాబు హయాంలో చేసుకున్న విండ్, సోలార్ పవర్ ఒప్పందాలతో ఏపీకి అదనపు భారం పడింది. చంద్రబాబు పీపీఏల వల్ల రూ.2 వేల కోట్ల భారం పడింది. అదనంగా రూ.3.41రూ. కట్టాల్సి వచ్చింది. రూ.5.90 తక్కువా? రూ.2.49 తక్కువా?. అంత దిక్కుమాలిన రేట్లకు ఒప్పందాలు చేసిన చంద్రబాబు మంచోడా?. ఇంత తక్కువ ధరకు ఆఫర్‌కు స్పందించి.. రాష్ట్రానికి మంచి జరిగే ఒప్పందం చేసుకున్న నేను మంచివాడినాజగన్ ఆలోచనలతో.. 25 ఏళ్లకు లక్షల కోట్ల ఆదాయం కలిసొస్తే.. చంద్రబాబు ఒప్పందాలతో అదే పాతికేళ్లకు 87 వేల కోట్ల సంపద ఆవిరి అయ్యేది. సంపదను ఆవిరి చేసిన చంద్రబాబు మంచోడా?. భవిష్యత్తు కోసం ఆలోచించిన నేను మంచోడినా?. చంద్రబాబు తెలిసి చేస్తోంది ధర్మమేనా?.కేంద్రం ప్రతిపాదన టైంలోనే.. కేబినెట్ సమావేశం జరిగింది. సెకి ప్రతిపాదనపై.. మంచి చెడులు చెప్పాలని ఇంధన శాఖను ఆదేశించాం. సుమారు 40 రోజులు అధ్యయనం జరిగింది. కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి జరిపిన ఒప్పందం ఇది. 2021 నవంబర్ 11న ఏపీఈఆర్సీ అనుమతించింది. ఏపీ గవర్నమెంట్(ఎడిస్కంలు), సెకి మధ్య జరిగిన ఒప్పందమే ఇది. 2021 డిసెంబర్ 1వ తేదీన జరిగిన ఈ పవర్ సేల్ అగ్రిమెంట్‌లో మూడో పార్టీనే లేదు. చారిత్రక ఘట్టం జరిగితే.. దుష్ప్రచారం చేస్తున్నారు అని జగన్ స్పష్టం చేశారాయన.ఇదే సెకి మరికొన్ని స్టేట్స్‌తో కూడా పవర్ సేల్ ఒప్పందం చేసుకుంది. అన్నింటికంటే తక్కువ ఇచ్చింది ఏపీకే. ఇంత చవకైన ఒప్పందం ఇంతకు ముందెన్నడూ జరగలేదు.కానీ, చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా, సగం సగం తెలివి ఉన్న ఆయన తరఫునవాళ్లు కొందరు ఈ ఒప్పందాన్ని వక్రీకరిస్తున్నారు. గుజరాత్‌లో 1.90తో ఒప్పందం చేసుకుంటుందని చంద్రబాబు అంటున్నారు. ఈనాడు గుజరాత్‌ను రిఫరెన్స్‌గా చెబుతోంది. కానీ, గుజరాత్ నుంచి తెప్పించి ఉంటే.. ఇంటర్ మిషన్ ట్రాన్స్‌మిషన్ ఛార్జీలు పడేవి. గుజరాత్, రాజస్థాన్ పవర్ జనరేషన్ కాస్ట్ గురించి మాట్లాడుతున్నారు. ట్రాన్స్‌మిషన్ ఛార్జ్ గురించి ఎందుకు మాట్లాడడం లేదు. ఇప్పుడు గుజరాత్‌లో సెకీ పిలిచిన టెండర్లు రూ.2.62కి తక్కువ లేవు. మంచి చేసిన వాళ్ల మీద రాళ్లు వేస్తునన్నారు. ఇది చరిత్రలో నిలిచిపోయే ఘట్టం. అయినా.. చంద్రబాబు, ఆయన సోషల్ మీడియా ఇంతలా వక్రీకరించి మాట్లాడడం ధర్మమేనా?. అని ప్రశ్నించారు.ఇక పారిశ్రామిక వేత్త అదానికి ఎపిలో అనేక ప్రాజెక్ట్ లున్నాయి,అనేక సందర్భాలలో ఆయన నన్ను కలిశారు.. నేను ఆయన్ను కలిశాను.. అంతమాత్రాన లంచాలు స్వీకరించానని ప్రచారం చ్హేరా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు జగన్. అమెరికా పేర్కొన్న ఛార్జీ షీట్ లో తన పేరు ఎక్కడా లేదని, ఇక్కడ మాత్ర తానేదే తప్పు చేసినట్లుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.. తనపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై వంద కోట్లకు పరువు నష్ట దావావేస్తానని అన్నారు జగన్.

## తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్రం అభివృద్ధి

**-మాస్టర్ ప్లాన్‌కు నివేదిక లివ్వండి..**
**-అధికారులకు కలెక్టర్ రాజకుమారి ఆదేశం**



**టీ మీడియా,నవంబర్ 28,నంద్యాల:** తిరుమల క్షేత్ర తరహాలోనే శ్రీశైల మహా క్షేత్రం అభివృద్ధికి సమగ్ర వివరాలతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు నివేదికలు ఇవ్వాలని సంబంధిత అధికారులను నంద్యాల జిల్లా కలెక్టర్ జీ రాజకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ సీ విష్ణు చరణ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, శ్రీశైలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, ఆత్మకూరు డీఎఫ్ఓ సాయిబాబా, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, సర్వే ల్యాండ్ ఏడీ జయరాజు తదితర అధికారులు పాల్గొన్నారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జీ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకరంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నదన్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం మహా క్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించి నివేదికలు పంపాలని గత సోమవారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన దేవాదాయ, పర్యాటక, ఆర్ అండ్ బీ మంత్రుల కమిటీ సమావేశంలో నిర్దేశించారన్నారు. ఈ మేరకు జిల్లాలో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధికి సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు అవసరమయ్యే నివేదికలను శుక్రవారం సాయంత్రంలోగా అందజేయాలని దేవాదాయ, అటవీ, సర్వే అధికారులను కలెక్టర్ ఆదేశించారు.వచ్చే రెండేండ్లలో తిరుమల క్షేత్ర తరహాలో శ్రీశైలం క్షేత్రాన్నిఅభివృద్ధి చేసేందుకు సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని కలెక్టర్ జీ రాజకుమారి చెప్పారు. కనుక సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో నివేదికలు తయారు చేసి ఇస్తే మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. గతంలో దేవాదాయ, అటవీ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే నివేదికలను కూడా పొందుపరచాలని సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీని ఆదేశించారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన అటవీ విస్తీర్ణం, అటవీ సరిహద్దుల సర్వే, గజిట్ నోటిఫికేషన్, నందికొట్కూరు రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణుల నిషేధిత భూములు సంబంధిత వివరాలతో నివేదికలు అందజేయాలని డీఎఫ్ఓను కలెక్టర్ ఆదేశించారుశ్రీశైల దేవస్థానం ఆధీనంలో ఉన్న భూములు, అటవీ సరిహద్దుల నుండి రక్షణ గోడలు, తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి నివేదికలను అందజేయాలని శ్రీశైలం దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్‌ను కలెక్టర్ ఆదేశించారు. శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి గతంలో మంత్రుల కమిటీ సూచించిన అంశాలు, తయారు చేసిన నివేదికలను కూడా అందజేయాలన్నారు. సున్నిపెంట నుండి శ్రీశైలం వరకు 2.5 కిలోమీటర్ల ఐకానిక్ బ్రిడ్జి ఏర్పాటు ప్రతిపాదనలు, రహదారి విస్తరణ పనులు కూడా మాస్టర్ ప్లాన్ నివేదికలో పొందుపరుస్తామని కలెక్టర్ తెలిపారు.



## శ్రీశైలంలో పడిపోతున్న నీటి మట్టాలు

**-వేసవికి ముందే అడుగంటే ప్రమాదం**
**-ప్రస్తుత నీటి మట్టం 130 టీఎంసీలే**

**ఆందోళనలో ఆయకట్టుదారులు**

**టీ మీడియా,నవంబర్ 28,శ్రీశైలం :** ప్రాజెక్టు నిల్వలు భారీగా పడిపోయాయి. దీంతో ఆయకట్టుదారుల్లో ఆందోళన ప్రారంభమైంది. గురువారం నాటికి అధికారులు వెల్లడించిన ప్రకారం శ్రీశైలం ప్రాజెక్టులో 130 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో గరిష్ఠ నీటి నిల్వ 215 టీఎంసీలు. సుమారు 95 టీఎంసీలు తక్కువగా ఉన్నాయి. తెలంగాణ యాసంగి పంటలకు సాగు నీరు అందుతుందో లేదో అని ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు.

**వర్షాలు బాగా కురిశాయి.. కానీ**

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు నెల రోజుల ముందుగానే ప్రాజెక్టు నిండింది. దాదాపు రెండు నెలల పాటు విస్తారంగా వర్షాలు కురవడంతో వరద నీరు నాగార్జున సాగర్ ద్వారా కృష్ణ నదిలోకి విడిచిపెట్టారు. అలాగే కృష్ణ నదికి భారీ వరదలు కూడా వచ్చాయి. శ్రీశైలం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆరు కంటే ఎక్కువ సార్లు గేట్లను ఎత్తి దిగువకు నీరు విడిచిపెట్టారు. నెల రోజుల క్రితం వరకు నిండు కుండలా ఉన్న శ్రీశైలం జలాశయం నీటి నిల్వలు దారుణంగా పడిపోయాయి.

**విద్యుత్ ఉత్పత్తి పెంచి ఏపీ, తెలంగాణ**

శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు భారీగా ఉండడంతో ఆంధ్రా, తెలంగాణకు చెందిన జల విద్యుత్ కేంద్రాలు విద్యుత్ ఉత్పత్తి పెంచాయి. ఈ కారణంతోనే శ్రీశైలం నీటి నిల్వ దారుణంగా పడిపోయినట్లు తెలుస్తోంది. ప్రతి రోజు విద్యుత్ ఉత్పత్తి కోసం నీటి వినియోగిస్తుండగా అవుట్ ఫ్లో 35,315 క్యూసెక్కులు ఉంటుంది. దీంతో శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 867.40 అడుగులకు చేరుకుంది. కుడి గట్టులో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయగా, ఎడమగట్టులో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. అయితే ఔట్ ఫ్లో ఇలానే కొనసాగితే మరో రెండు నెలల్లో శ్రీశైలం జలాశయం పూర్తిగా అడుగంటిపోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



## రవాణా శాఖలో పదోన్నతులు..

**-ఉత్తర్వులు జారీ !**

**టీ మీడియా,నవంబర్ 28,హైదరాబాద్ :** రాష్ట్ర రవాణా శాఖలో డీటీసీలకు జేటీసీలుగా, ఆర్టీఓలకు డీటీసీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతులు పొందిన మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్, శివ లింగయ్య డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతులు పొందిన రవీందర్ కుమార్, వాణి,సదానందం,కిషన్, సురేష్ రెడ్డిలు గురువారం మంత్రి నివాసంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు.దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో సాధ్యమయ్యాయన్నారు. ఈ సందర్భంగా రవాణా శాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ కుమార్, తెలంగాణ గ్రూప్ 1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారుఈ సందర్భం గా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వాహనదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు రహదారి భద్రతను పెంపొందించడానికి రవాణా శాఖ అధికారులు కృషి చేయాలని మార్గ నిర్దేశనం చేశారు.

## ప్రజాపాలన కాదు.. రాక్షస పాలన

**-మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**



**టీ మీడియా,నవంబర్ 28,నిజామాబాద్ :** తెలంగాణలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ కండకావరమే కనిపిస్తున్నది.. అక్రమ అరెస్టులు, లాఠీచార్జీలు, నిర్బంధాలు, కూల్చివేతలు, పేల్చివేతలు.. ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా? అని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఇది ప్రజా పాలన కాదు, రాక్షస పాలన అని మండిపడ్డారు.నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ భూములు పాడిపంటలతో విలసిల్లితే, రేవంత్‌రెడ్డి వచ్చాక అగ్నిమంటలతో కాలిపోతూ కనిపిస్తున్నాయన్నారు. సీఎం సోదరులది అంతులేని అవినీతి, చిట్టినాయుడు దుర్నీతికి తెలంగాణ ఆహుతి అవుతుందని తెలిపారు. రేవంత్ సోదరుల భూకబ్జాలకు అధికారులు వంత పడుతున్నారని, పల్లెల్లో అధికారుల దురహంకారం పెరుగుతుండంతో రైతులు, ప్రజలు తిరగబడుతున్నారన్నారు. మొన్న లగచర్ల, నిన్న దిలావర్‌పూర్.. ఏ గ్రామంలో అయినా కాంగ్రెస్ సర్కారుపై ప్రజల సంగ్రామమే కనిపిస్తున్నదన్నారు. రైతులతో పెట్టుకున్న వాళ్లెవరు బాగు పడలేదని, బషీర్‌బాగ్‌లో రైతులను చంపించిన చంద్రబాబు తట్టాబుట్టా సదురుకుని పోయిండని జీవన్‌రెడ్డి గుర్తు చేశారు. చంద్రబాబుకు పట్టిన గతే చిట్టినాయుడికి పడుతుందన్నారు. గురుకులాల్లో మరణ మృందగం మోగుతున్నదని, 11 నెలల్లో 48 మంది విద్యార్థులు మృత్యువాత పడితే పట్టించుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కరైనా సంతోషంగా ఉన్నారా? అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు.ఆటో డ్రైవర్ నుంచి అంగన్‌వాడీల వరకూ, ఉద్యోగుల నుంచి నిరుద్యోగుల వరకూ ఎవరూ సంతోషంగా లేరని తెలిపారు. పోలీసులు, లాయర్లు సైతం రోడ్లపైకి వస్తున్నారన్నారు. బాసర నుంచి మొదలు కీసర దాకా అందరు దేవుళ్లకు శఠగోపం పెట్టిన ఘనుడు రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. మూసీ ప్రక్షాళన పేరుతో రూ.లక్షన్నర కోట్ల అవినీతికి సిద్ధపడుతున్నాడని ఆరోపించారు. ఇదేమని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేయిస్తున్నారని తెలిపారు. అధికారులు అతి చేస్తున్నారని, వారి పేర్లు పింక్ బుక్‌లో ఎక్కిస్తున్నామని చెప్పారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని, తప్పు చేసిన వారు ఎక్కడున్నా పట్టుకుని వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. దీక్షా దివస్ స్ఫూర్తితో రేవంత్ సర్కారుపై సమరభేరి మోగిస్తామని చెప్పారుజడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, బీఆర్ఎస్ పార్టీ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా, నేతలు రాంకిషన్‌రావు, సుజీత్‌సింగ్ ఠాకూర్, ప్రభాకర్, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.